03-01-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రికి చెందినవారిగా అయి తండ్రి పేరును ప్రఖ్యాతము చేయండి, సంపూర్ణ పవిత్రముగా అవ్వడంతో పేరు ప్రఖ్యాతమవుతుంది, మీరు సంపూర్ణ మధురముగా కూడా అవ్వాలి"

ప్రశ్న:- సంగమయుగములో పిల్లలైన మీకు సత్యయుగములో ఉండని ఏ ఒక్క చింత ఉంటుంది?

జవాబు:- సంగమములో మీకు పావనంగా అవ్వాలి అనే చింతయే ఉంటుంది, తండ్రి మిమ్మల్ని ఇతర విషయాలన్నింటి నుండి నిశ్చింతులుగా చేసారు. ఈ పాత శరీరాన్ని చాలా సంతోషంగా వదలాలి అని మీరు పురుషార్థము చేస్తారు. పాత వస్త్రాన్ని వదిలి కొత్తది తీసుకుంటామని మీకు తెలుసు. పిల్లలు ప్రతి ఒక్కరు తమ హృదయాన్ని ప్రశ్నించుకోవాలి - మాకు ఎంత సంతోషము ఉంటుంది, మేము తండ్రిని ఎంతగా స్మృతి చేస్తున్నాము.

ఓంశాంతి. మధురాతి మధురమైన చాలా కాలం తర్వాత కలిసిన పిల్లలకు ఆత్మిక తండ్రి అర్థం చేయిస్తారు. వారు చదివిస్తారు కూడా, అర్థం చేయిస్తారు కూడా. వారు రచయిత మరియు రచనల ఆదిమధ్యాంత రహస్యాలను చదివిస్తారు మరియు సర్వగుణ సంపన్నులుగా అవ్వండి, దైవీ గుణాలను ధారణ చేయండి అని అర్థం చేయిస్తారు. స్మృతి చేస్తూ, చేస్తూ మీరు సతోప్రధానులుగా అయిపోతారు. మీకు తెలుసు - ఈ సమయంలో ఇది తమోప్రధాన సృష్టి, ఇంతకుముందు సతోప్రధాన సృష్టి ఉండేది, అది 5000 సంవత్సరాలలో తమోప్రధానముగా అయిపోయింది. ఇది పాత ప్రపంచము. వీరు కొత్త ప్రపంచములో ఉండేవారు లేక శాంతిధామములో ఉండేవారు అని అందరి గురించి అంటారు కదా. తండ్రి ఆత్మలకే కూర్చొని అర్థం చేయిస్తారు - ఓ ఆత్మిక పిల్లలూ, మీరు సతోప్రధానంగా తప్పకుండా అవ్వాలి, తండ్రి నుండి వారసత్వాన్ని తప్పకుండా తీసుకోవాలి, మీ తండ్రినైన నన్ను తప్పకుండా స్మృతి చేయాలి. లౌకిక పిల్లలు కూడా స్మృతి చేస్తారు. ఎంత పెద్దగా అవుతూ ఉంటారో అంతగా హద్దులోని వారసత్వాన్ని పొందేందుకు హక్కుదారులుగా అవుతూ ఉంటారు. మీరు అనంతమైన తండ్రికి పిల్లలు, తండ్రి నుండి అనంతమైన వారసత్వాన్ని తీసుకోవాలి. ఇప్పుడు భక్తి మొదలైనవి చేయవలసిన అవసరం లేదు. ఇది విశ్వవిద్యాలయమని పిల్లలు అర్థం చేసుకున్నారు. మనుష్యమాత్రులందరూ చదువుకోవాలి. అనంతమైన బుద్ధిని ధారణ చేయాలి. ఇప్పుడు ఈ పాత ప్రపంచము పరివర్తన అవ్వనున్నది. ఎవరైతే ఇప్పుడు తమోప్రధానంగా ఉన్నారో వారు సతోప్రధానంగా అవుతారు. ఈ సమయంలో మనం అనంతమైన తండ్రి నుండి అనంతమైన సుఖపు వారసత్వాన్ని పొందుతున్నామని పిల్లలకు తెలుసు. ఇప్పుడు మనం ఒక్క ఆత్మిక తండ్రి యొక్క మతముపైనే నడవాలి. ఈ ఆత్మిక స్మృతి యాత్ర ద్వారానే మీ ఆత్మ సతోప్రధానంగా అవుతూ ఉంటుంది, ఆ తర్వాత సతోప్రధాన ప్రపంచములోకి వెళ్ళాలి. మనం బ్రాహ్మణులమని, మనం తండ్రికి చెందినవారిగా అయ్యామని మీకు అర్థమవుతుంది. చదువును చదువుతున్నాము మరియు చదవడాన్నే జ్ఞానము అని అంటారు. భక్తి వేరు. బ్రాహ్మణులైన మీకే తండ్రి జ్ఞానాన్ని వినిపిస్తారు, ఇంకెవ్వరికీ ఈ జ్ఞానం గురించి తెలియదు. టీచర్ అయినటువంటి జ్ఞానసాగరుడైన తండ్రి ఎలా చదివిస్తారు అనేది వారికి తెలియదు. బాబా టాపిక్ లు అయితే ఎన్నో అర్థం చేయిస్తూ ఉంటారు. తండ్రికి చెందినవారిగా అయి ఆ తండ్రి పేరును ప్రఖ్యాతము చేయడమే నంబరు వన్ విషయము. సంపూర్ణ పవిత్రముగా అవ్వాలి, సంపూర్ణ మధురముగా కూడా అవ్వాలి. ఇది ఈశ్వరీయ విద్య. భగవంతుడు కూర్చొని చదివిస్తారు. ఆ ఉన్నతోన్నతమైన తండ్రిని స్మృతి చేయాలి. ఇది క్షణకాలపు విషయము. స్వయాన్ని ఆత్మగా భావించండి. ఆత్మలమైన మనం శాంతిధామములో నివసిస్తామని, ఆ తర్వాత పాత్రను అభినయించేందుకు ఇక్కడకు వస్తామని మీకు తెలుసు. పునర్జన్మలలోకి వస్తూనే ఉంటారు. నంబరువారుగా 84 జన్మల పాత్రను ఇప్పుడు మనం పూర్తి చేసాము. ఈ చదువును కూడా అర్థం చేసుకోవాలి, అలాగే ఈ పాత్రను కూడా అర్థం చేసుకోవాలి. డ్రామా రహస్యము కూడా బుద్ధిలో ఉంది. ఇది మన అంతిమ జన్మ అని, ఇందులో తండ్రి లభించారని మీకు తెలుసు. ఎప్పుడైతే 84 జన్మలను పూర్తి చేస్తారో అప్పుడు పాత ప్రపంచము పరివర్తన అవుతుంది. మీకు ఈ అనంతమైన డ్రామా, 84 జన్మలు మరియు ఈ చదువు గురించి తెలుసు. 84 జన్మలను తీసుకుంటూ, తీసుకుంటూ ఇప్పుడు చివరిలోకి వచ్చి చేరుకున్నారు. ఇప్పుడు చదువుకుంటున్నారు, ఆ తర్వాత కొత్త ప్రపంచములోకి వెళ్తారు. కొత్త-కొత్తవారు వస్తూ ఉంటారు. ఎంతో కొంత నిశ్చయము ఏర్పడుతూ ఉంటుంది. కొందరైతే ఈ చదువులో నిమగ్నమైపోతారు. మేము సతోప్రధానముగా, పవిత్రముగా అవుతున్నామని బుద్ధిలో ఉంది. మనం పవిత్రముగా అవుతూ, అవుతూ ఉన్నతిని పొందుతూ ఉంటాము.

బాబా అర్థం చేయించారు - మీరు ఎంతగా స్మృతి చేస్తారో, అంతగా మీ ఆత్మ పవిత్రంగా అవుతూ ఉంటుంది. పిల్లల బుద్ధిలో మొత్తం డ్రామా అంతా కూర్చొని ఉంది. మీరు ఈ ప్రపంచానికి సంబంధించినదంతా వదిలేసి వచ్చారని కూడా తెలుసు. ఏదైతే ఈ కళ్ళతో చూస్తున్నారో, అది చూడకూడదు. ఇదంతా సమాప్తమైపోయేదే ఉంది. ఇప్పుడు ఇది మీ అంతిమ జన్మ, ఇంకెవ్వరికీ ఈ అనంతమైన డ్రామా గురించి తెలియదు. మీకిప్పుడు మొత్తం చక్రమంతటి గురించి తెలుసు, బాబా ఇప్పుడు మిమ్మల్ని తమోప్రధానము నుండి సతోప్రధానముగా తయారుచేయడానికి వచ్చారు. ఏ విధంగా ఆ పరీక్షలు 12 మాసాల తర్వాత జరుగుతాయో, అలాగే మీ స్మృతియాత్ర కూడా ఇప్పుడు ఇంకా పూర్తవ్వలేదు. ఎన్నో విషయాలు గుర్తుంటాయి, ఆ తర్వాత స్మృతి పక్కా అయ్యే కొలది ఇంకేదీ గుర్తుండదు. ఆత్మ పూర్తి అశరీరిగా వచ్చింది, అశరీరిగా వెళ్ళాలి. మీకు మొత్తం సృష్టి యొక్క మనుష్యమాత్రులందరి పాత్ర గురించి తెలుసు. మనుష్యుల సంఖ్య ఎంతగానో పెరుగుతూ ఉంటుంది. కోట్లాదిమంది అయ్యారు. సత్యయుగములోనైతే మనం చాలా కొద్దిమందే ఉన్నాము. పునర్జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ ఇతర ధర్మాల మతాలు-మార్గాలు, శాఖోపశాఖలు పెరుగుతూ-పెరుగుతూ వృక్షము ఎంతో పెద్దదిగా అయిపోయింది. ఆది సనాతన దేవీ-దేవతా ధర్మమే కనుమరుగైపోయింది. మనమే దేవీ-దేవతా ధర్మంలో ఉండేవారము, సతోప్రధానముగా ఉండేవారము. ఇప్పుడు ఆ ధర్మమే తమోప్రధానముగా అయిపోయింది, ఇప్పుడు మళ్ళీ సతోప్రధానముగా అవ్వాలి మరియు ఆ విధంగా అయ్యేందుకే మనం చదువుకుంటున్నాము. ఎంతగా చదువుతారో, చదివిస్తారో అంతగా అనేకుల కళ్యాణము జరుగుతుంది. ఎంతో ప్రేమగా అర్థం చేయించాలి. విమానాల నుండి కరపత్రాలను పంచాలి. అందులో కూడా - మీరు జన్మ-జన్మాంతరాలుగా భక్తి చేస్తూ వచ్చారు అన్న విషయాన్ని అర్థం చేయించాలి. గీతను చదవడం కూడా భక్తియే. గీతను చదవడం ద్వారా మనుష్యుల నుండి దేవతలుగా అవుతారని కాదు. డ్రామానుసారంగా ఎప్పుడైతే తండ్రి వస్తారో అప్పుడే వచ్చి సతోప్రధానులుగా అయ్యేందుకు యుక్తిని తెలియజేస్తారు. అప్పుడు సతోప్రధాన పదవి లభిస్తుంది.

ఈ చదువు ద్వారా మనం ఈ విధముగా తయారవ్వనున్నామని మీకు తెలుసు. ఇది ఈశ్వరీయ పాఠశాల. భగవంతుడు చదివించి మిమ్మల్ని నరుని నుండి నారాయణునిగా తయారుచేస్తారు. మనం సతోప్రధానముగా ఉన్నప్పుడు స్వర్గము ఉండేది. తమోప్రధానముగా అవ్వడంతో నరకముగా ఉంది. మళ్ళీ చక్రం తిరగనున్నది. తండ్రియే వచ్చి మనుష్యుల నుండి దేవతలుగా, విశ్వాధిపతులుగా తయారయ్యే పురుషార్థాన్ని చేయిస్తారు. తండ్రిని స్మృతి చేయాలి మరియు దైవీ గుణాలను ధారణ చేయాలి. కొట్లాడుకోకూడదు, గొడవపడకూడదు. దేవతలు ఎప్పుడూ కొట్లాడుకోరు. మీరు కూడా అదే విధంగా తయారవ్వాలి. మీరే ఆ విధంగా సర్వగుణ సంపన్నులుగా ఉండేవారు, మళ్ళీ శ్రీమతము ఆధారంగా అదే విధముగా తయారవ్వాలి. మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవాలి - మాకు ఎంతవరకు సంతోషము ఉంది? ఎంతవరకు నిశ్చయము ఉంది? ఇది రోజంతా గుర్తుండాలి. కానీ మాయ ఎటువంటిదంటే అది మరపింపజేస్తుంది. మనం తండ్రితోపాటు విశ్వ సేవాధారులమని మీకు తెలుసు. ఇంతకుముందు మీరు హద్దులోని చదువును చదివేవారు, ఇప్పుడు అనంతమైన చదువును అనంతమైన తండ్రి ద్వారా చదువుతున్నారు. ఇది పాత శరీరము, దీనిని సమయమనుసారంగా వదులుతాము, ఇది దానంతట అదే పోకూడదు, మనం సంతోషముగా శరీరాన్ని వదలాలి. మనం ఈ ఛీ-ఛీ శరీరాన్ని వదిలి, పాత ప్రపంచాన్ని కూడా వదిలి సంతోషముగా వెళ్తాము. ఏదైనా ప్రత్యేకమైన రోజు ఉన్నప్పుడు సంతోషముగా కొత్త వస్త్రాలను ధరిస్తారు కదా. అలాగే కొత్త ప్రపంచములో మనకు కొత్త శరీరము లభిస్తుందని ఇక్కడ మీకు తెలుసు. పావనంగా అవ్వాలి అన్న ఒక్క చింతయే మనకు ఉంది, ఇతర చింతలన్నింటి నుండి మనం నిశ్చింతులుగా అవుతాము. ఇవన్నీ అంతమవ్వనున్నాయి, ఇక దేని గురించి చింతించాలి. అర్ధకల్పం మనం భక్తి మార్గంలో చింతలో ఉన్నాము. ఇక తర్వాత అర్ధకల్పం వరకు ఇంకే చింతా ఉండదు. ఇంకా కొద్ది సమయం మాత్రమే ఉంది. పావనముగా అవ్వాలి అని కొంచెం చింత ఉంది. ఇక తరవాత ఒక్క చింత కూడా ఉండదు. ఇది సుఖ-దుఃఖాల ఆట. సత్యయుగములో సుఖము ఉంటుంది, కలియుగములో దుఃఖము ఉంటుంది. బాబా అర్థం చేయించారు - మీరు ఇలా అడగవచ్చు - మీరు సత్యయుగ సుఖధామపు నివాసులా లేక కలియుగ దుఃఖధామపు నివాసులా? ఈ కొత్త-కొత్త విషయాలను మీరు వినిపిస్తారు. వారు తప్పకుండా - ఇప్పుడు మేము దుఃఖధామపు నివాసులమే అని అంటారు. ఎంతో ప్రేమగా అడగడం జరుగుతుంది, తద్వారా మనుష్యులు తాము ఎక్కడి నివాసులో తమకు తామే అర్థం చేసుకోగలుగుతారు. వీరు ఇలా ప్రశ్నలను అడిగే యుక్తి చాలా బాగుంది అని అంటారు. ఎంత గొప్ప వ్యక్తి అయినా, ధనవంతుడైనా సరే, తాను నరకవాసియే కదా. స్వర్గము అని కొత్త ప్రపంచాన్నే అంటారు. ఇప్పుడు కలియుగము పాత ప్రపంచము. ఈ ప్రశ్నలు చాలా బాగున్నాయి. మెట్ల వరుసలో కూడా స్పష్టముగా ఉంది. మీరు సుఖధామములో ఉన్నారా లేక దుఃఖధామములో ఉన్నారా? ఇది నరకమా లేక స్వర్గమా? మీరు దేవతలా లేక అసురులా? ఈ విషయాలను అడగాలి. తప్పకుండా సత్యయుగాన్ని దైవీ ప్రపంచము అని

అంటారు. కలియుగాన్ని నరకము, అసురీ ప్రపంచము అని అంటారు. కావున మీరు సత్యయుగ స్వర్గపు దైవీ ప్రపంచవాసులా లేక కలియుగ అసురీ ప్రపంచవాసులా? అని అడగాలి. మీరు ఎంత ధనవంతులైనా కానీ ఏ ప్రపంచ నివాసులు? ఇప్పుడు మీలోకి ఈ జ్ఞానం వచ్చింది. ఇంతకుముందు ఈ విషయాలు ఆలోచనలలో కూడా ఉండేవి కావు. ఇప్పుడు మేము సంగమములో ఉన్నాము అని మీరు అర్థం చేసుకున్నారు. ఎవరైతే కలియుగములో ఉన్నారో వారు పతితులుగా, నరకవాసులుగా ఉన్నారు, మళ్ళీ పావనముగా తయారవ్వాలి. కావుననే ఓ పతితపావనా రండి, వచ్చి మమ్మల్ని పావనంగా తయారుచేయండి అని పిలుస్తారు. ఈ విషయాలను కూడా అర్థం చేయించాలి. మీ వద్దకు లెక్కలేనంతమంది మనుష్యులు వస్తారు, అయినా కానీ కోట్లలో కొందరే వెలువడుతారు. నేను ఎవరినో, ఎలా ఉన్నానో, ఏం నేర్పిస్తానో, అది ఏ ఒక్కరో గుర్తిస్తారు, దానిపై అరుదుగా ఏ ఒక్కరో నడుస్తారు. ప్రభాతయాత్రలో కూడా - మేము ఈ చదువు ద్వారా స్వర్గవాసులుగా అవుతున్నాము అన్నదే చూపించండి. సత్య, త్రేతా, ద్వాపర, కలియుగాలు... ఈ చక్రము తిరుగుతుంది కదా. మీ బుద్ధిలో పూర్తి చక్రమంతా ఉంది. మీరు మళ్ళీ సుఖధామానికి, శాంతిధామానికి యజమానులుగా అవుతారు. సుఖధామములో దుఃఖము యొక్క నామరూపాలు కూడా ఉండవు. ఒకవేళ పూర్తిగా చదవకపోతే పదవి కూడా తక్కువదే పొందుతారు. ఇదైతే సాధారణమైన విషయము, కావుననే అనంతమైన చదువును చదివి అనంతమైన వారసత్వాన్ని తీసుకోండి. కేవలం స్వయాన్ని ఆత్మగా భావిస్తూ అనంతమైన తండ్రిని స్మృతి చేయాలి. బాబా చాలా మధురమైనవారు. దేహ సహితంగా దేహపు సర్వ బంధనాలను సమాప్తం చేయండి అన్నది వారి డైరెక్షన్. ఆత్మ అయితే అవినాశీ. ఇప్పుడిప్పుడే శరీరాన్ని తీసుకుంటారు, ఇప్పుడిప్పుడే వదిలివేస్తారు. పెద్ద సమయమేమీ పట్టదు. ఈ సమయంలోనైతే రోజురోజుకు అందరూ తమోప్రధానముగా అవుతూ ఉంటారు. ఎప్పుడైతే మనం సతోప్రధానముగా ఉండేవారమో, అప్పుడు ఎంతో ఎక్కువ ఆయుష్షు కలవారిగా ఉండేవారము మరియు చాలా కొద్దిమందే ఉండేవారము. ఇతర ఏ ధర్మమూ ఉండేదే కాదు. మీ ఆయుష్షు ఇప్పటి మీ పురుషార్థము ద్వారానే పెరుగుతుంది. మీరు ఎంతగా స్మృతి చేస్తారో అంతగా మీ ఆయుష్షు పెరుగుతుంది. మీరు సతోప్రధానముగా ఉన్నప్పుడు మీ ఆయుష్షు చాలా ఎక్కువగా ఉండేది. ఆ తర్వాత ఎంతగా కిందకు దిగజారుతూ వచ్చారో అంతగా ఆయుష్షు తగ్గిపోతూ వచ్చింది. రజోలోకి దిగినప్పుడు ఆయుష్షు తక్కువైంది, తమోలోకి వచ్చినప్పుడు ఇంకా తక్కువైంది. ఏ విధంగా బావి నుండి నీటిని తీసుకునే నీటి చక్రం ఉదాహరణ ఉంది కదా, నీటితో డబ్బా నిండుతూ ఉంటుంది, మళ్ళీ ఖాళీ అయిపోతూ ఉంటుంది. అలాగే ఇది కూడా అనంతమైన నీటి చక్రం వంటిది. ఇప్పుడు మీరు నింపుకుంటున్నారు. అలా నింపుకుంటూ-నింపుకుంటూ పూర్తిగా నిండిపోతారు, మళ్ళీ మెల్ల-మెల్లగా ఖాళీ అయిపోతారు. దీనిని బ్యాటరీతో కూడా పోల్చడం జరుగుతుంది. ఇప్పుడు మనం సతోప్రధానంగా అయి వెళ్తాము, మళ్ళీ 84 జన్మలను తీసుకుంటాము. అర్ధకల్పం తర్వాత రావణ రాజ్యం ప్రారంభమవుతుంది. రావణ రాజ్యంలో అందరినీ నరకవాసులు అని అంటారు. చివరిలో ఎవరైతే వస్తారో వారు నరకములోకే వస్తారు. మొదట మీరు స్వర్గములోకి వెళ్తారు. ఈ తండ్రి ద్వారా భక్తి ఫలము లభిస్తుంది. వీరు ఎంతో భక్తి చేసారు, అందుకే జ్ఞానం కూడా తీసుకుంటున్నారని అర్థం చేసుకోవడం జరుగుతుంది. ఈ రహస్యాలన్నింటినీ మీకు తండ్రి అర్థం చేయించారు. మీరు మళ్ళీ ఇతరులకు అర్థం చేయించాలి. మనుష్యులు అనేక రకాలైన పాపాలను చేస్తూ వచ్చారు. ఇప్పుడు తండ్రి వచ్చారు, మీకు జ్ఞానాన్ని ఇస్తున్నారు. తండ్రి ఎప్పుడైతే వస్తారో అప్పుడే చదివిస్తారు. అంతకుముందు వరకు ఏమీ తెలియదు, పాపాత్ములుగా అవుతూనే వచ్చారు. పుణ్యాత్ములుగా ఎలా అవుతారు, మళ్ళీ పాపాత్ములుగా ఎలా అవుతారు, ఎవరు సత్యయుగ నివాసులుగా ఉంటారు, ఎవరు కలియుగ నివాసులుగా అవుతారు, ఏమీ తెలిసేది కాదు. ఇప్పుడు తండ్రి అర్థం చేయించారు. తండ్రిని జ్యోతి అని కూడా అంటారు. వారిలో ప్రకాశము కూడా ఉంది మరియు శక్తి కూడా ఉంది. ప్రకాశములోకి వస్తే అనగా మేల్కొంటే శక్తి వచ్చేస్తుంది. మీ జీవిత ఆయుష్షు కూడా పెరుగుతుంది. మిమ్మల్ని అక్కడ మృత్యువు కబళించలేదు. సంతోషంగా ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటారు, దుఃఖపు విషయమేమీ ఉండదు. అది అంతా ఒక ఆట వలె ఉంటుంది. (సర్పము ఉదాహరణ). మీరు సత్యయుగము నుండి మొదలుకుని కలియుగము వరకు పాత్రను అభినయించారు. ఇది బుద్ధిలో కూర్చుండిపోయింది.

బాబా మీకు తండ్రి కూడా, శిక్షకుడు కూడా మరియు సద్గురువు కూడా. ఇది కేవలం పిల్లలు మాత్రమే నంబరువారు పురుషార్థానుసారంగా తెలుసుకుంటారు. మీరు ఎన్ని జన్మలు తీసుకుంటారు అంటూ పునర్జన్మలను కూడా మీరు అర్థం చేసుకున్నారు. బ్రాహ్మణ ధర్మంలో మీరు ఎన్ని జన్మలను తీసుకుంటారు? (ఒక జన్మ) కొందరు రెండు-మూడు జన్మలు కూడా తీసుకుంటారు. ఉదాహరణకు ఎవరైనా శరీరాన్ని విడిచిపెడితే వారు ఆ బ్రాహ్మణత్వపు సంస్కారాలను తమతోపాటు తీసుకువెళ్తారు. ఆ బ్రాహ్మణత్వపు సంస్కారాలు ఉన్న కారణముగా మళ్ళీ సత్యాతి-సత్యమైన బ్రాహ్మణ కులములోకి వచ్చేస్తారు. బ్రాహ్మణ కులానికి సంబంధించిన ఆత్మలైతే వృద్ధి చెందుతూ ఉంటారు. బ్రాహ్మణ కులపు

సంస్కారాలనైతే తీసుకువెళ్తారు కదా. ఏవైనా లెక్కాచారాలు ఉన్నట్లయితే రెండు-మూడు జన్మలు కూడా తీసుకోవచ్చు. ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటారు. ఆత్మ బ్రాహ్మణ కులము నుండి దైవీ కులములోకి వెళ్తుంది. ఇక్కడిది శరీరానికి సంబంధించిన విషయం కాదు. ఇప్పుడు మీరు తండ్రికి చెందినవారిగా అయ్యారు, మీరు ఈశ్వరీయ సంతానము, అలాగే ప్రజాపిత బ్రహ్మకు కూడా సంతానము. మీకు వేరే సంబంధమేమీ లేనే లేదు. అనంతమైన తండ్రికి చెందినవారిగా అవ్వడం ఏమైనా తక్కువ విషయమా! మీరు సుఖధామానికి యజమానులుగా అవుతారు. కేవలం ఆ పెద్ద తండ్రిని మీరు తెలుసుకున్నా సరే మీ నావ ఆవలి తీరానికి చేరుకుంటుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి - 1. మాకు సంతోషము ఎంతవరకూ ఉంటుంది? 2. సర్వగుణ సంపన్నులుగా ఉండేవారము, ఇప్పుడు శ్రీమతాన్ని అనుసరించి మళ్ళీ అలా తయారవ్వాలి అన్న నిశ్చయము ఎంతవరకూ ఉంది? 3. మేము సతోప్రధానముగా ఎంతవరకూ అయ్యాము? పగలు-రాత్రి సతోప్రధానంగా (పావనంగా) అవ్వాలి అన్న చింత ఉంటుందా?

2. అనంతమైన తండ్రితో పాటుగా విశ్వ సేవను చేయాలి. అనంతమైన చదువును చదవాలి మరియు చదివించాలి. దేహ సహితముగా బంధనాలేవైతే ఉన్నాయో వాటిని తండ్రి స్మృతితో సమాప్తం చెయ్యాలి.

వరదానము:- యజమానత్వపు స్మృతి ద్వారా మన్మనాభవ స్థితిని తయారుచేసుకునే మాస్టర్ సర్వశక్తివాన్ భవ

సదా ఈ స్మృతి ఇమర్జ్ రూపంలో ఉండాలి - ఆత్మనైన నేను ‘‘చేయించేవాడిని’’, యజమానిని, విశేష ఆత్మను, మాస్టర్ సర్వశక్తివంతుడను. ఈ యజమానత్వపు స్మృతి ద్వారా మనస్సు, బుద్ధి మరియు సంస్కారాలు మీ ఆధీనములో ఉంటాయి. నేను వేరు మరియు నేను యజమానిని - ఈ స్మృతి ద్వారా మన్మనాభవ స్థితి సహజంగా తయారవుతుంది. ఈ అతీతత్వపు అభ్యాసమే కర్మాతీతంగా చేస్తుంది.

స్లోగన్:- నిందను మరియు డిస్టర్బన్స్ ను సహించటము మరియు ఇముడ్చుకోవటము అనగా మీ రాజధానిని నిశ్చితము చేసుకోవటము.

అవ్యక్త సైలెన్స్ ద్వారా డబుల్ లైట్ ఫరిశ్తా స్థితిని అనుభవము చెయ్యండి

సైలెన్స్ అనగా శాంత స్వరూప ఆత్మ, ఎప్పుడైతే ఏకాంతములో ఉంటారో, అప్పుడు మనసు-బుద్ధి యొక్క ఏకాగ్రత అనుభవమవుతుంది. ఆ ఏకాగ్రత ద్వారానే విశేషంగా రెండు శక్తులు ప్రాప్తిస్తాయి - 1. పరిశీలించే శక్తి 2. నిర్ణయించే శక్తి. ఈ రెండు విశేష శక్తులే వ్యవహారములో మరియు పరమార్థములో, రెండింటిలో సర్వ సమస్యలను పరిష్కరిస్తాయి. దీని వలన సహజంగానే డబుల్ లైట్ ఫరిశ్తా స్థితి తయారవుతుంది.